క్లుప్తంగా

పాఠశాల ఆవరణలో మట్టి తోలించాలి



ఈపూరు : స్థానిక బీసీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణ రోడ్డు కంటే పల్లంగా ఉన్నందున నీరు నిలబడి విద్యార్థులకు ఇబ్బందికరంగా మారిందని, తక్షణమే మెరక తోలించాలని ఎంపీడీవో ప్రభాకర్‌కు పాఠశాల యాజమాన్య కమిటీ శనివారం వినతిపత్రం అందజేసింది. పాఠశాల ఆవరణలో ప్రార్థన నిర్వహించడానికి కూడా ఇబ్బందిగా ఉందని వివరించారు. పాఠశాలలో 100మంది విద్యార్థులు ఉన్నారని, ప్రస్తుతం ఉన్న మూడు గదులు చాలడం లేదని తెలిపారు. అదనపు తరగతి గదుల మంజూరుకు సిఫార్సు చేయాలని కోరారు. నిధుల కొరతతో మనబడి-మన భవిష్యత్ పనులు మధ్యలో నిలిచిపోయాయని, వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ ఎం. నాగరాజు, సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తెలుగు తల్లి విగ్రహం ఏర్పాట్ల పరిశీలన



నరసరావుపేట: స్టేషన్ రోడ్డులోని గాంధీ పార్కులో తెలుగుతల్లి విగ్రహ ఏర్పాట్లను శనివారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆరేళ్ల క్రితం ఆర్‌యూబీ పక్కనే ఉన్న స్థలంలో ఏర్పాటు చేసిన తెలుగుతల్లి విగ్రహాన్ని తొలగించి గాంధీపార్కులో ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. అనంతరం 12వ వార్డు షాలెంనగర్, మున్సిపల్ కార్యాలయం సమీపంలో పారిశుద్ధ్య, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులను ఆయన పరిశీలించారు.

ఆధార్ నమోదు, మార్పు చేర్పులకు ప్రత్యేక కేంద్రాలు

చిలకలూరిపేట: పట్టణ పరిధిలో ఆధార్ నమోదు, మార్పు చేర్పులు చేసుకొనేందుకు నాలుగు ప్రత్యేక కేంద్రాలను ఈ నెల 22 నుంచి 25 తేదీ వరకు ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరిబాబు తెలిపారు. పట్టణంలోని ఆర్‌వీఎస్ సీవీఎస్ హైస్కూల్, శారదా జెడ్పీ హైస్కూల్ (ఏ బ్లాక్), శారదా జెడ్పీ హైస్కూల్ (బీ బ్లాక్), బీఆర్‌జీజీ మున్సిపల్ హైస్కూల్‌లలో ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. వీటిలో 0-18 సంవత్సరాల వారికి కొత్త ఆధార్ కార్డు నమోదు, అడ్రస్, జిల్లాల మార్పు సంబంధిత సేవలు లభిస్తాయని వివరించారు.

ఎరువులను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

నరసరావుపేట రూరల్: ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలని, అధికంగా అమ్మితే చర్యలు తీసుకుంటామని ఏడీఏ పి.మస్తానమ్మ తెలిపారు. పట్టణంలోని ఎరువుల దుకాణాలను ఆమె శనివారం మండల వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబుతో కలిసి తనిఖీ చేశారు. ఎరువుల స్టాక్ రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు, ఇన్‌వాయిస్ కాపీలు, ఎరువుల స్టాక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మస్తానమ్మ మాట్లాడుతూ స్టాక్ బోర్డు, ధరల పట్టికను రైతులకు కనిపించే విధంగా ప్రదర్శించాలని తెలిపారు. మండలంలోని రైతుసేవా కేంద్రాలు, జీడీసీఎంస్‌లు, పీఏసీఎస్‌లు, ప్రైవేటు డీలర్ల వద్ద ఎరువులు పుష్కలంగా ఉన్నాయని, రైతులు ఆందోళన చెందవద్దని ఆమె సూచించారు.

గ్రామసభల్లో అర్జీల వెల్లువ

నాదెండ్ల: చందవరం సచివాలయం వద్ద శనివారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ ఏవీ రమణ, డీటీ ధనలక్ష్మి పాల్గొన్నారు. రైతుల నుంచి 77 అర్జీలు స్వీకరించారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో భూముల కొలతల్లో తేడాలున్నట్లయితే యజమానులు అర్జీలు అందించాలని, పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో శ్రీధర్‌బాబు, సర్వేయర్ రాంబాబు పాల్గొన్నారు.

యడ్లపాడులో...

మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేట సచివాలయం వద్ద రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. రైతుల నుంచి తహసీల్దార్ జయశ్రీ , డీటీ అర్జీలు స్వీకరించారు. ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు.

ప్రొటోకాల్‌కు తెలుగు తమ్ముళ్ల మంగళం

- కూటమి నేతల పేర్లతో ఆర్భాటంగా శిలాఫలకం ఏర్పాటు
- ఇన్‌చార్జి మంత్రి, కలెక్టర్ పేర్లు మాయం

నాదెండ్ల: పల్లె పండుగలో భాగంగా మండలంలోని కనపర్రులో శనివారంరోడ్డు, డ్రెయిన్‌ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ముఖ్య అతిథిగా పాల్గొని శిలాఫలకాలను ఆవిష్కరించారు. అయితే, శిలాఫలకాలపై ప్రొటోకాల్ మరవడంపై అధికారులు, నాయకుల్లో చర్చ జరిగింది. శిలాఫలకంపై ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, డెప్యూటీ సీఎం పి. పవన్‌కళ్యాణ్, జెడ్పీ చైర్మన్ కత్తెర హెన్రీక్రిస్టినా, ఎంపీపీ తలతోటి రాణి పేర్లను మాత్రమే ముద్రించారు. వాస్తవంగా గ్రామ కార్యక్రమాల్లో సర్పంచ్ పేరు కూడా పొందుపరచాలి. ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, మర్రి రాజశేఖర్, ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు తదితరుల పేర్లను కూడా పొందుపరచాలి. అభివృద్ధి పనులకు గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు ఖర్చు చేస్తున్నందున డ్వామా పీడీ లింగమూర్తి పేరును సైతం పొందుపరచాల్సి ఉంది. అయితే, ఇవేం లేకుండా శిలాఫలకాన్ని టీడీపీ నాయకులు ఏర్పాటు చేశారు. కార్యక్రమం ప్రారంభమయ్యే సమయంలో సర్పంచ్ పెరుమాళ్ళపల్లి వెంకటేశ్వర్లు పేరును స్టిక్కర్ వేసి అంటించారు. అయితే, మండల టీడీపీ నాయకులు ప్రొటోకాల్‌ను ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించటంపై ఆ పార్టీ నాయకులే అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండల అధికారులు సైతం చూసీ చూడనట్లు వ్యవహరించారు.



ప్రొటోకాల్ పాటించకుండా ఏర్పాటు చేసిన శిలాఫలకం

మహిళాభ్యున్నతికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట: మహిళాభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్‌లో మెప్మా బజారును శనివారం ఆయన ప్రారంభించి, స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. స్వయం సహాయ సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయిస్తున్నట్లు తెలిపారు. వడ్డీ లేని రుణాల పరిమితిని రూ. 3లక్షల నుంచి రూ. 10లక్షల వరకు పెంచుతామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. మెప్మా బజార్లతో మహిళలు ఆర్థికంగా బలోపేతం అవుతారని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో పలువురికి ఉద్యోగాలు

నిరుద్యోగులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకొని ఉద్యోగ అవకాశాలు పొందడం అభినందనీయమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రత్తిపాటి గార్డెన్స్‌లో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్‌మేళాను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో మొత్తం 20లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగ మేళాలో ఎంపిక కాని వారి కోసం ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం కింద మేళాలు పెట్టి రుణ సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు. జాబ్‌మేళాకు మొత్తం 36 సంస్థలు వచ్చాయని, 2,427 మంది నిరుద్యోగులు పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆయన తెలిపారు. వారిలో 472 మంది నేరుగా ఎంపికయ్యారని, మరో 390 మందిని షార్ట్‌లిస్టు చేశారని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఎమ్మెల్యే నియామక పత్రాలు అందజేశారు.



మెప్మా స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు

సీసీ రోడ్డు, డ్రెయిన్‌ల నిర్మాణానికి శంకుస్థాపన

నాదెండ్ల: మండలంలోని కనపర్రులో శనివారం పంచాయతీ రాజ్ మాసోత్సవాల్లో భాగంగా పల్లె పండుగ నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీసీ కాలనీలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు, సైడు కాల్వల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ప్రభుత్వంపై పెట్టుకున్న ఆశలను నెరవేరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ తలతోటి రాణి, ఇన్‌చార్జి ఎంపీడీవో స్వరూపారాణి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నెల్లూరి సదాశివరావు, నాయకులు సింగయ్య, జయప్రసాద్, రమేష్, కరిముల్లా, మరియదాసు, రాఘవయ్య, అంతయ్య, ఖాజామొహిద్దీన్, పాపారావు ,శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

చట్టాలను పారదర్శకంగా అమలుచేయాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

రొంపిచర్ల : రాష్ట్ర ప్రభుత్వం చట్టాలను పారదర్శకంగా అమలుచేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. శనివారం రొంపిచర్ల వచ్చిన ఆయనకు బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు ఉన్న అట్రాసిటీ చట్టం లాగా బీసీలకు రక్షణ చట్టం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బీసీలలో ఎక్కువగా చేతి వృత్తులకు సంబంధించిన కులాలు ఉన్నాయని, వీరందరికీ రక్షణ చట్టం ఎంతో అవసరమని తెలిపారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. అనంతరం శంకరరావును బీసీ సంక్షేమ సంఘం మండల నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సరికొండ తిమ్మరాజు, మండల నాయకులు ముక్కడాల శ్రీనివాసరావు, వెంగళరాజు సుబ్బరాజు పాల్గొన్నారు.

అంతర పంటలతో అధిక ఆదాయం

నాదెండ్ల: అంతర పంటల సాగుతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చని జిల్లా డీపీఎంకే అమలకుమారి చెప్పారు. యడ్లపాడు మండలం చెంఘీజ్‌ఖాన్‌పేటలో శనివారం పంటలను పరిశీలించారు. పత్తి సాగులో అంతర పంటలుగా వేసిన కూరగాయల నాణ్యతను పరిశీలించారు. రైతులు ఒకే పంటపై కాకుండా అంతర పంటలను సాగు చేసుకోవాలని ఆమె సూచించారు. దీంతో అధిక, స్థిరమైన ఆదాయం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏవో సరిత పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో 'పల్లె పండుగ' విజయవంతం

శావల్యాపురం: పల్లె పండుగ కార్యక్రమాలు ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం అయినట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. పల్లె పండుగ కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని శావల్యాపురం, పొట్లూరు గ్రామాల్లో శనివారం సీసీ రోడ్లు, గోకులం షెడ్ల నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సీతారామయ్య మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీలో 20 పనులకు రూ. 2 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. 22 మంది లబ్ధిదారులకు గోకులం షెడ్ల నిర్మాణ పనులకు ప్రజాప్రతినిధులు, అధికారుల సారథ్యంలో శ్రీకారం చుట్టామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచులు యాగసిరి చెన్నమ్మ, పోపూరి జ్యోతి, ఏపీవో కె.రామారావు, ఏపీయం జి.వాసుబాబు పాల్గొన్నారు.



శావల్యాపురంలో జరిగిన భూమిపూజలో అధికారులు, ప్రజాప్రతినిధులు

నాలుగు గ్రామాల్లో పల్లె పండుగ

నాదెండ్ల : యడ్లపాడు మండలం జగ్గాపురం, జాలాది, సందెపూడి, తుర్లపాడు గ్రామాల్లో శనివారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. నాలుగు గ్రామాల్లో రూ.31 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, క్యాటిల్ షెడ్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హేమలతాదేవి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి

జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు

రొంపిచర్ల : విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు చెప్పారు. స్థానిక బీసీ కాలనీలోని మండల విద్యావనరుల కేంద్రం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, విద్యార్థుల హాజరు పట్టికతో పాటు ఉపాధ్యాయుల పనితీరును, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని ఆయన ఆదేశించారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలని ఆయన ఆదేశించారు. విద్యార్థుల డ్రాపవుట్స్ తగ్గించి, హాజరుశాతాన్ని పెంచాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో డి.బ్రహ్మేశ్వరరావు, ఉపాధ్యాయులు ఆర్.వకుళాదేవి, అంగన్‌వాడీ టీచర్ నాగమల్లేశ్వరి, ఎమ్మార్పీ పచ్చవ రామకృష్ణ పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఈవో

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

నరసరావుపేట రూరల్: ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థి అదృశ్యమైన ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు విచారణ చేపట్టారు. రూరల్ ఎస్ఐ కిశోర్ తెలిపిన వివరాలు... మాచర్లకు చెందిన బందారు దుర్గారావు పాలపాడు రోడ్డులోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 12న స్వగ్రామానికి వెళ్లిన అతడు చదువుపై తనకు ఆసక్తి లేదని తల్లి కృష్ణవేణికి తెలియజేశాడు. తల్లిదండ్రులు నచ్చజెప్పి పంపించడంతో ఈనెల 16న తిరిగి హాస్టల్‌కు వచ్చాడు. 17న అర్ధరాత్రి హాస్టల్ నుంచి బయటకు వచ్చిన దుర్గారావు తరువాత కనిపించకుండా పోయాడు. దీనిపై తల్లి కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మానవ అక్రమ రవాణాను నిరోధించాలి

నరసరావుపేట రూరల్: హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ ఆధ్వర్యంలో శంకరభారతీపురం జెడ్పీ హైస్కూలులో శనివారం మానవ అక్రమ రవాణాపై వాక్ ఫర్ ఫ్రీడమ్.. నిశబ్ద నడక పేరుతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రూరల్ సీఐ పి.రామకృష్ణ, ప్రధానోపాధ్యాయురాలు ఎం.పార్వతి, స్పోక్ పర్సన్ అనంతలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 21వ శతాబ్దంలో కూడా వ్యక్తులను వస్తువులుగా కొనడం దారుణమని పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ లెక్కల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 49.6 మిలియన్ల మంది ప్రజలు అవయవాలు దోపిడీ, లైంగిక శ్రమ, బలవంతపు వివాహాలతో పాటు వివిధ రకాల బానిసత్వంలో చిక్కుకున్నారని తెలిపారు. బాలికలు ప్రధానంగా లైంగిక దోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నారు. మానవ అక్రమ రవాణా లేని సమాజం కోసం అందరం కృషిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.ఆనంద్ బెంజిమన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల పొట్ట కొట్టడం అన్యాయం

నరసరావుపేట: రాజకీయ కారణాలతో తొలగించిన కార్మికులంతా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన పేదవారని, వారందరినీ మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగ పట్టణ కార్యదర్శి షేక్ చిన అల్లాబక్షు కోరారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోపణలు లేకుండా కార్మికులను రాజకీయ కారణాలతో తొలగించడం అన్యాయమని ఖండించారు. కార్యక్రమంలో జిలానీ మాలిక్, ఉద్యోగులు పాల్గొన్నారు.

పీడీగా రాధాకృష్ణమూర్తి సేవలు అభినందనీయం



శావల్యాపురం: అంకితభావంతో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు సమాజంలో మంచి గుర్తింపు పొందుతారని బెజవాడ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో శనివారం పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ జాతీయస్థాయి క్రీడా పోటీల్లో బాలబాలికలు ఉత్తమ ఫలితాలు సాధించడానికి రాధాకృష్ణమూర్తి కృషి చేశారన్నారు. ఉపాధ్యాయులు కుమ్మరి శ్రీనివాసరాజు, భువనేశ్వరి, నిర్మల పాల్గొన్నారు.

కొండయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ మండలం దొండపాడులో పిడుగుపాటుకు మరణించిన పి. కొండయ్య కుటుంబానికి కూటమి ప్రభుత్వం రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము కోరారు. ఆ కుటుంబాన్ని శనివారం రైతు సంఘం నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో కె.మల్లికార్జునరావు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

సాఫ్ట్ బాల్ రాష్ట్ర జట్టుకు విద్యార్థుల ఎంపిక



జస్వంత్ తేజ, మోహనలక్ష్మి

నాదెండ్ల: సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు అండర్- 14 సాఫ్ట్‌బాల్ రాష్ట్రజట్టుకు ఎంపికయ్యారు. రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన పోటీల్లో సిద్ధాబత్తిని మోహనలక్ష్మి (8వ తరగతి), వనపర్తి జస్వంత్ తేజ (7వ తరగతి) ఎంపికయ్యారు. ఇద్దరూ ఈ నెలాఖరులో చిత్తూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. విద్యార్థులను హెచ్ఎం వెంకటరావు, పీడీ కె. అంజమ్మ, ఇన్‌చార్జి హెచ్ఎం పి. ప్రసాద్ అభినందించారు.